# పర్యాటక అభివృద్ధి పనులు వేగవంతం

పర్యాటక శాఖ సమీక్షలో మంత్రి జూపల్లి కృష్ణారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ పర్యాటక రంగాన్ని దేశంలోనే మేటిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. మంగళవారం హిమాయత్ నగర్ లోని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ (టిజిటిడిసి) కార్యాలయంలో సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వల్లూరి,ఇతర ఉన్నతాధికారులతో ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదల, పర్యాటక ఆస్తుల వినియోగం, ప్రాచుర్యం, ప్రచారం, ఆదాయ మార్గాలు, హరిత హోటళ్ల నిర్వహణ, పెండింగ్ పనులపై అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రధాన పర్యాటక ప్రాంతాలలో సూచిక బోర్డులు, ఫుడ్ కోర్టులు, టూరిజం సమాచార కేంద్రాలు వంటి ప్రాథమిక సౌకర్యాల స్థితిగతులపై మంత్రి సమీక్షించారు. బోటింగ్ సౌకర్యాలు, కాటేజీలు, వ్యూ పాయింట్లు, హరితహోటళ్ల నిర్వహణను మరింత మెరుగుపరచాలని అధికారులకు సూచించారు.రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, పర్యాటకుల సంఖ్య పెరిగేలా, వారికి మరింత సౌకర్యాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. ప్రపంచ పర్యాటక ముఖ చిత్రంలో తెలంగాణ కీలక స్థానంలో ఉండాలనే సీయం రేవంత్ రెడ్డి అకాంక్షలకు అనుగుణంగా పర్యాటక రంగ అభివృద్ధి, బ్రాండింగ్, ప్రమోషన్, ప్రచారం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసి తెలంగాణను ఆకర్షణీయమైన టూరిజం గమ్యస్థానంగా తీర్చిద్దేందుకు అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని చెప్పారు. పర్యాటక ప్రచారంపై ఆయా రాష్ట్రాలు అవలంభిస్తున్న విధానాలను అధ్యయనం చేసి వాటికి ధీటుగా మన పర్యాటక ప్రాంతాలకు ప్రచారం కల్పించాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రముఖ పర్యాటక ప్రదేశాలకు పర్యాటకులు సులభంగా చేరుకునేలా సూచిక బోర్డులను (డైరెక్షన్ సైనేజ్) ఏర్పాటు చేయాలని, సాధ్యమైనంత త్వరగా వీటిని పూర్తి చేయాలన్నారు. కేవలం దారి చూపడమే కాకుండా, ఆయా ప్రాంతాల చరిత్ర, ప్రాధాన్యతను బోర్డులపై క్లుప్తంగా వివరించాలని తెలిపారు. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటంతో పాటు, కళాకారులను ప్రోత్సహించేందుకు పర్యాటక కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలి. మన కళలు, మన భాష, మన సంస్కృతి మన అస్తిత్వానికి ప్రతీకలు. వాటిని పరిరక్షించుకుంటూ భావితరాలకు అందించేందుకు కృషి చేయాలి. కళాకారులకు తగిన గుర్తింపు, ఆర్థిక చేయూత అందించే దిశగా చర్యలు ఉంటాడాలి. ప్రసిద్ధ ప్రదేశాల్లో హంపి థియేటర్లు నిర్మించాలని మంత్రి జూపల్లి పేర్కొన్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు.

## సొసైటీని దెబ్బ తీస్తున్న ఆర్‌టిసి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కార్మికుల నిధులతో నడిచే సొసైటీని ఆర్‌టిసి యాజమాన్యం దెబ్బ తీస్తోందని ఆర్‌టిసి బోర్డు మాజీ డైరెక్టర్ ఎం నాగేశ్వరరావు ఆరోపించారు. కార్మికుల నెలవారీ వేతనాల నుంచి సిసిఎస్ పేరుతో వసూలు చేస్తున్న 100 కోట్ల రూపాయల మొత్తాన్ని సంబంధిత సొసైటీ ఖాతాలో జమ చేయకుండా వందల కోట్ల మేర వడ్డీలను ఎగ్గొడుతున్నారని ఆయన విమర్శించారు.ఈ అంశంపై ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని, కార్యకుల డబ్బులను సొసైటీ ఖాతాల్లోనే జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యకుల ప్రయోజనాలను కాపాడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎం నాగేశ్వరరావు కోరారు.

# పశ్చిమాసియాలో శాంతికి ఇరాన్ మూడంచెల పథకం

మొజ్తబా సీనియర్ అధికారుల ప్రతిపాదన

అందుకు అంగీకరిస్తే చర్చలకు సిద్ధం

చైనా మధ్యవర్తిత్వంపై పూర్తి విశ్వాసం ఉంది : ఫజ్లి



**బీజింగ్:** పశ్చిమాసియాలో శాంతికి ఉంఇరాన్ సీనియర్ అధికారులు ఫోన్ సంభాషణల్లో మూడంచెల పథకాన్ని ప్రతిపాదించారు. ఈ మూడు అంచెల పథకాన్ని గనుక అనుసరిస్తే పశ్చిమాసియాలో శాంతి సాధ్యమేనని చైనాలో ఇరాన్ దౌత్యవేత్త అబ్దొల్ రెజా రహ్మనీ ఫజ్లి చెప్పారు. ఇరాన్‌లో ఉన్న సంక్షోభ పరిస్థితులను చైనా మీడియాకు ఆయన వివరించారు. 'ఇరాన్ సంక్షోభ పరిష్కారానికి కొత్త నాయకుడి నాయకత్వంలో రాజకీయ, దౌత్య మార్గాలనే కొనసాగిస్తుందా?'। అని ప్రశ్నించగా, తమ దేశ కొత్త సర్వాధినేత మోజ్తాబా ఖమేనీ నాయకత్వంలో యుద్ధ రంగం నుండి అందరూ వెనక్కి వెళ్ళేందుకు, రాజకీయ పరిష్కారం సాధించేందుకు పశ్చిమాసియాలో శాంతికి ఇరాన్ అధికారులు ఫోన్ సంభాషణల్లో మూడు అంచెల పథకాన్ని ప్రతిపాదించారని చెప్పారు. ''ఈ మూడంచెల పథకంలో మొదటిది యుద్ధం ముగించాలి, దాడుల విరమణ చేపట్టాలి. మొదట ఎవరు దాడి ప్రారంభించారో వారే దాడులు ఆపేయాలి. దాడులు ఆపడానికి వారే చొరవ తీసుకోవాలి. ఈ యుద్ధం ముగించాలంటే ముందుగా ఇజ్రాయెల్, అమెరికాదేశాలు దాడులు నిలిపివేసేవిధంగా మొదట వారిపై ఒత్తిడి తెచ్చే కార్యచరణ చేపట్టాలి. అన్ని రకాల మిలిటరీ దాడులను వారు నిలిపివేయాలి. రెండో అంచెలో భాగంగా అందరూ చర్చల బల్ల దగ్గరకు వెళ్లాలి. ఈ అంచెలో దీనిని సాధించడం కష్టమే, దాదాపు అసాధ్యం...ఎందుకంటే మనం ఇక ఎంతోకాలం అమెరికాను నమ్మే పరిస్థితులు లేవు, ప్రపంచంలో ప్రధానశక్తులుగా ఉన్న దేశాలు, ఐక్యరాజ్యసమితి ముందుకు రావాలి, జోక్యం చేసుకోవాలి. చర్చల సందర్భంగా క్లిష్ట దశలు వచ్చినప్పుడు వారు తమ స్వరాన్ని వినిపించాలి. ఈ సంప్రదింపుల్లో ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి జోక్యం చేసుకోవాలి.ఎందుకంటే సంప్రదింపులు జరిగే సమయంలో మళ్ళీ వాటిని మధ్యలో వదిలిపెట్టి దాడులు చేసే పరిస్థితులు, దురాక్రమణ చర్యలు తలెత్తకూడదు, అందుకు వారు భరోసాగా నిలబడాలి. సంప్రదింపుల ద్వారా వచ్చే ఫలితాలను సంరక్షించాల్సిన అవసరం ఉంది. ఇక మూడో అంచెలో ప్రపంచవ్యాప్తంగా ఏకపక్ష విధానాలను, ఏకధృవ ప్రపంచాన్ని ఉమ్మడిగా మనందరం ప్రతిఘటించాలి, ఏకధృవ ప్రపంచ విధానాన్ని విడనాడాలి. బహుళ ప్ర.పంచ వ్యవస్థ అభివృద్ధి చెందడానికి ఉమ్మడిగా అందరూ ప్రోత్సాహం ఇవ్వాలి. పైన పేర్కొన్న మూడు అంచెల విధానం ప్రాతిపదికపై అందరూ ముందుకు కదలాలి. ఆ సూత్రాలను గౌరవించాలి. వాటిని పూర్తిగా అమలు చేసే దిశగా వెళ్ళాలి. ఈ సూత్రాల ప్రాతిపదికపై మేం చర్చలు పునరుద్ధరించడానికి సిద్ధంగా ఉన్నాం'' అని చైనాలో ఇరాన్ దౌత్యవేత్త ఫజ్లి స్పష్టం చేశారు.

ఇదిలా ఉండగా, పశ్చిమ ఆసియాలో శాంతి సాధనకు, మధ్యవర్తిత్వ పాత్ర నిర్వహించేందుకు చైనా ఇప్పటికే క్రియాశీల ఆచరణ ప్రారంభించింది. గల్ఫ్ దేశాలతో మంతనాలు చేసేందుకు ప్రత్యేక దూతలు అక్కడ ఇప్పటికే రంగంలోకి దిగి పనిచేస్తున్నారు. గల్ఫ్ సహకార మండలి సెక్రటరీ జనరల్ జాసెం మహ్మద్ అల్బుదైవీని చైనా ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జైజున్ కలిసిరెండు రోజులక్రితమే సంభాషణలు ప్రారంభించారు. చైనా మరింత నిర్మాణాత్మక పాత్ర పోషిస్తుందని, శాంతిని స్థిరీకరించడానికి, శత్రుత్వాలను అంతంచేసి ఉద్రిక్తతలను సడలించడానికి జిసిసితో కలిసి పనిచేస్తుందని జై జున్ చెప్పారు. చైనా మధ్యవర్తిత్వంపట్ల ఇరాన్‌కు పూర్తి విశ్వాసం ఉందని బీజింగ్‌లో ఇరాన్ దౌత్యవేత్త అబ్దొల్ రెజా రహ్మనీ అన్నారు. యుద్ధాన్ని ముగించడానికి, దురాక్రమణను నిరోధించడానికి చైనా తీసుకునే ఎలాంటి చర్యలనైనా మేం స్వాగతిస్తామని అన్నారు. ఒక ప్రధాన శక్తిగా ఈ ప్రాంతంలో, ప్రపంచంలో చైనా గణనీయమైన ప్రభావాన్ని చూపిస్తోందన్నారు. సంభాషణల ద్వారా చైనా సంబంధిత వైరి పక్షాలను సంయమనం పాటించాలని చెప్పగలదని, ఒప్పించగలదన్న విశ్వాసం తమకు ఉందని అన్నారు.

## పారదర్శక సేవలే లక్ష్యం
## భూముల రీ-సర్వేకు ఆధునిక 'రోవర్లు'

బడ్జెట్ సన్నాహక సమావేశంలో మంత్రి పొంగులేటి వెల్లడి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో భూ లావాదేవీలను మరింత పారదర్శకంగా నిర్వహించి ప్రజలకు, ముఖ్యంగా రైతులకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సచివాలయంలో మంగళవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన నిర్వహించిన 2026–27 బడ్జెట్ సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖలకు సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనలను సమర్పిస్తూ మంత్రి పలు కీలక అంశాలను వెల్లడించారు. భూ సమస్యల పరిష్కారంలో జాప్యం తగ్గించేందుకు రెవెన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. భూముల సర్వేను ఆధునిక సాంకేతికతతో నిర్వహించేందుకు అత్యాధునిక 'రోవర్' పరికరాలను వినియోగించనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే ప్రతి మండలానికి ఒకటి చొప్పున 460 రోవర్లను కొనుగోలు చేసినట్లు చెప్పారు. వచ్చే బడ్జెట్‌లో మరో 400 రోవర్ల కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. రాష్ట్రంలో నక్షా (మ్యాప్) లేని 373 గ్రామాల్లో త్వరలోనే రీ సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకోసం 202627 బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలని ఉప ముఖ్యమంత్రిని కోరారు. ప్రస్తుతం అద్దె భవనాల్లో కొనసాగుతున్న ఆర్‌డిఓ, తహశీల్దార్ కార్యాలయాలకు శాశ్వత ప్రభుత్వ భవనాలను నిర్మించేందుకు అవసరమైన బడ్జెట్ కేటాయింపులు చేయాలని కూడా విజ్ఞప్తి చేశామన్నారు. సమావేశంలో రెవెన్యూ, ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రభాకర్ రావుకు భారీ ఊరట

**ప్రజాపక్షం /హైదరాబాద్:**దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది.ఈ కేసులో ఎ1 నిందితుడు, మాజీ ఐపిఎస్ అధికారి ప్రభాకర్ రావుకు భారీ ఊరట లభించింది. అరెస్ట్ నుంచి మినహాయింపు ఇస్తూ దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు మంగళవారం ఉత్తర్వులు ఇచ్చింది. మరోవైపు దర్యాప్తునకు సహకరించాలని ప్రభాకర్ రావుకు సూచనలు చేసింది. సాక్ష్యాలు, ఆధారాలు ట్యాంపర్ చేస్తే ముందస్తు బెయిల్ రద్దు అవుతుందని ప్రభాకర్ రావును హెచ్చరించింది. అంతే కాదు.. కోర్టు అనుమతి లేకుండా రాష్ట్రం, దేశం దాటడానికి వీల్లేదని పేర్కొంది. ఇదిలా ఉంటే.. గత బిఆర్ఎస్ పాలనలో తెలంగాణలోని పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులను టార్గెట్గా చేసుకుని ఫోన్ ట్యాపింగ్ జరిగిందనే అంశం రాష్ట్రాన్ని కుదిపేసింది. దీనిపై రేవంత్ సర్కార్ ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో ఈకేసులో నిందితులైన పలువురు పోలీసు ఉన్నతాధికారులపై కేసులు నమోదు చేశారు. వారిలో ప్రభాకర్రావు, ప్రణీత్ రావు, రాధాకిషన్ రావు, తిరుపతన్న వంటి వారు ఉన్నారు. అప్పట్లో ఇంటెలిజెన్స్ చీఫ్గా వ్యవహరించిన ప్రభాకర్ రావు మీద ఫోన్ ట్యాపింగ్ కేసులో భాగంగా పలు సంచలన ఆరోపణలు ఉన్నాయి.

మినుములు, వేరుశనగ పంటల

## కొనుగోళ్లకు కేంద్రం సానుకూలం

మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** యాసంగి (రబీ) 2025–26 సీజన్‌లో తెలంగాణ రాష్ట్రంలో పండిన మినుములు ,వేరుశెనగ , పొద్దుతిరుగుడు, శెనగలు పంటలను కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) కింద కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ మేరకు సోమవారం కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు లేఖ రాయడంతో పాటు ఫోన్ ద్వారా విజ్ఞప్తి చేశామన్నారు. దీంతో కేంద్ర మంత్రి సానూకూలంగా స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలను పరిశీలించి, త్వరలోనే కొనుగోలుకు అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారని మంత్రి తుమ్మల వెల్లడించారు. రాష్ట్రంలోని పలు వ్యవసాయ మార్కెట్ యార్డులకు ఇప్పటికే మినుములు, వేరుశెనగ, పొద్దుతిరుగుడు శెనగ పంటల రాక ప్రారంభమైందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతులు తమ పంటలను మార్కెట్లకు తీసుకువస్తున్న నేపథ్యంలో వారికి ఇబ్బందులు కలగకుండా, పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) లభించేలా వెంటనే కొనుగోలు కార్యక్రమాలు ప్రారంభించడం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు.రైతులు తమ పంటలను తక్కువ ధరలకు అమ్ముకునే పరిస్థితి రాకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం త్వరితగతిన అనుమతులు మంజూరు చేసి పిఎస్ఎస్ కింద కొనుగోలు ప్రక్రియ ప్రారంభిస్తే తెలంగాణ రైతులకు ఎంతో మేలు జరుగుతుందని మంత్రి తెలిపారు. రైతులకు న్యాయమైన ధరలు లభించడంతో పాటు వారి ఆదాయం పెరిగి వ్యవసాయం పట్ల మరింత నమ్మకం పెరుగుతుందని ఆయన అన్నారు. ఆయా పంటల కొనుగోలుకు మార్క్ ఫెడ్ సిద్ధంగా ఉందని, శనగ పంటకోసం 45 కొనుగోలు కేంద్రాలు, పొద్దుతిరుగుడు పంటకోసం 20 కొనుగోలు కేంద్రాలు, మినుముల కోసం 10, వేరుశనగ పంట కోసం 5 కొనుగోలు కేంద్రాలను ఆరంభించడానికి ఏర్పాట్లు చేసుకుందని మంత్రి తెలిపారు.

## పిటిషన్ విచారణార్హత లేదన్న సిబిఐ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** టైటానియం లీజుల వ్యవహారంలో ఇంటర్‌పోల్ జారీ చేసిన రెడ్‌కార్నర్ నోటీసును సవాలు చేస్తూ కాంగ్రెస్ నాయకుడు, రాజ్యసభ మాజీ సభ్యుడైన కేవీపీ రామచంద్రరావు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు విచారించే పరిధి లేదని సీబీఐ తెలిపింది. ఈ నోటీసు ఇంటర్‌పోల్ సంస్థ జారీ చేసినదని, దీనిపై అభ్యంతరాలు ఉంటే అక్కడే పారిస్ లోనే అప్పీల్ చేసుకోవాలని పేర్కొంది. ఈ వ్యవహారంపై వాదనలు విన్న జస్టిస్ ఎన్. తుకారాంజీ విచారణను రెండు వారాలకు వాయిదా వేశారు. పిటిషన్ కు విచారణ అర్హత ఉందని కెవిపి న్యాయవాది చెప్పారు దీనిపై వాదనలు రెండు వారాల తర్వాత జరుగుతాయి.

## సిజె బెంచ్ ముందుకు తీన్మార్ మల్లన్న పిటిషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గతంలో టిఆర్ఎస్ అధికారులు ఉండగా తనపై నమోదైన 100కుపైగా కేసులను నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టుకు బదిలీ చేయాలంటూ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ముందు ఉంచాలని హైకోర్టు న్యాయమూర్తి మంగళవారం ఆదేశించారు. ఈ అంశంపై తుది నిర్ణయం చీఫ్ జస్టిస్ ఆధ్వర్యంలోని డివిజన్ గురించి తగిన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ కేసును సీజె బెంచ్‌కు పంపించారు. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తుకారం జీ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. కాగా కింది కోర్టుల్లో కేసుల విచారణకు మల్లన్న హాజరుకు ఎనిమిది వారాలపాటు మినహాయింపు ఇచ్చారు.

## 'బిసి రచయిత సమాఖ్య' ఏర్పాటు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసిల ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయం, హక్కుల సాధన కోసం జరుగుతున్న పోరాటంలో అవసరమైన భావజాల వ్యాప్తి నిమ్మితం 'బిసి రచయితల సమాఖ్య'ను ఏర్పాటు చేసినట్టు సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ గాజోజు నాగభూషణం వెల్లడించారు. 42 శాతం రిజర్వేషన్ల సాధన,బిసిలకు రాజ్యాధికారం, అలాగే భారతీయ సమాజానికి సాహిత్య, సాంస్కృతిక, కళా రంగంలో బిసిలు అందిస్తున్న ఘనమైన సేవలను ప్రపంచానికి చాటేందుకు ప్రయత్నిస్తామని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివక్షకు గురవుతున్న బిసి జాతిని ఏకం చేయడమే బిసి రచయితల సమాఖ్య కార్యాచరణ అని అన్నారు. తమ సమాఖ్య లక్ష్యాలను, ఆశయాలను ప్రజల్లోకి తీసుకుపోవడానికి త్వరలోనే ఒక మహాసభను నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

## భద్రతా విభాగం కార్యదర్శిగా ఉదయ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పోలీస్ భద్రత, ఆరోగ్య భద్రత విభాగం నూతన కార్యదర్శిగా రిటైర్డ్ ఎస్‌పి. ఉదయ్ కుమార్ రెడ్డిని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, భద్రత విభాగం మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ బి. శివధర్ రెడ్డి నియమించారు . డిజిపి కార్యాలయంలో మంగళవారం డిజిపి అధ్యక్షతన సమావేశం జరిగింది. మేనేజ్మెంట్ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. కార్యదర్శి పదవికి వచ్చిన పలు ప్రతిపాదనలను పరిశీలించిన కమిటీ చైర్మన్ ఉదయ్ కుమార్ రెడ్డి నియామకానికి ఆమోదం తెలిపారు.ఉదయ్ కుమార్ రెడ్డి గతంలో ఆదిలాబాద్, మెదక్ జిల్లాల ఎస్‌పిగా విధులు నిర్వహించారు. ఆయనకు ఉన్న సుదీర్ఘ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ కీలక బాధ్యతలను అప్పగించారు. గత 20 ఏళ్లుగా భద్రత, ఆరోగ్య భద్రత కార్యదర్శిగా పనిచేసిన ఎ. గోపాల్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు. సమావేశం ప్రారంభంలో ఆయన మృతికి సంతాప సూచకంగా అధికారులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అంకితభావంతో ఆయన చేసిన సేవలను డిజిపి ఈ సందర్భంగా కొనియాడారు. అనంతరం విభాగం బలోపేతం, ఇతర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో శాంతి భద్రతల అడిషనల్ డిజిపి మహేష్ ఎం. భగవత్, ఇంటెలిజెన్స్ అడిషనల్ డిజిపి విజయ్ కుమార్, టిజిఎస్‌పి అడిషనల్ డిజిపి సంజయ్ కుమార్ జైన్, పి అండ్ ఎల్ ఐ జి పి గజరావు భూపాల్, సంగారెడ్డి ఎస్‌పి పరితోష్ పంకజ్, ఏఐజీ ఎం. రమణ కుమార్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు వై. గోపిరెడ్డి, పాల్గొన్నారు.

# రెట్టింపు ఉత్సాహంతో పని చేయండి

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షాన్‌వాజ్ ఖాసీం..



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అవార్డులు .. రివార్డులు తీసుకోవడంతో పాటు మరింతగా ఉత్సహంగా పని చేసి ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు మంచి పేరు తీసుక రావాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షాన్‌వాజ్ ఖాసీం అన్నారు. అబ్కారీ భవన్‌లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ చాంబర్‌లో 14 టీమ్‌లకు నగదు రివార్డ్ మంగళవారం డైరెక్టర్ అందించారు. ఈ నగదు రివార్డుల పంపిణిలో డైరెక్టర్ తోపాటు జాయింట్ కమిషనర్ అంజన్‌రావు, డిప్యూటి కమిషనర్ ప్రణవీలు ఉన్నారు. మెదక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ జి.శ్రీనివాసరెడ్డి టీమ్‌లకు సంగారెడ్డిలో 850 కేజీల గంజాయితో పాటు ముగ్గరికి 20 సంవత్సరాల శిక్ష పడే విధంగా చర్యలు చేపట్టిన టీమ్‌కు, నర్సాపూర్‌లో 587.25 లీటర్ల ఎన్‌డిపిఎల్ మద్యం పట్టుకున్న టీమ్‌కు, పటాన్ చెరువులో 122.85 కేజీల గంజాయిని పట్టుకున్న టీమ్‌కు నగదు రివార్డులను అందించారు. ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ అసిస్టెంట్ కమిషనర్ జి.గణేష్ టీమ్‌లు వైరా స్టేషన్ పరిధిలో 101.5 కేజీల గంజాయి, 2.7 కేజీల హషీస్ అయిల్ కేసును పట్టుకున్న టీమ్‌కు, భద్రాచలంలో 50.4 కేజీల గంజాయిని పట్టుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌కు, నేలకొండపల్లిలో 21,420 కేజీల బెల్లాన్ని పట్టుకున్నటీమ్‌కు ,అశ్వారావుపేటలో 4104 కేజీల బెల్లాన్ని పట్టుకున్న టీమ్‌లకు నగదు రివార్డులను అందించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో 4080 కేజీల బెల్లాని పట్టుకున్న టీమ్‌కు నగదు రివార్డులను అందించారు. భద్రాచలం 2.2 కేజీల హషీస్ అయిల్ పట్టుకున్న ఎస్‌టిఎఫ్ సిఐ వెంకశ్వర్లులకు, ధూల్‌పేట్ సిఐ మధుబాబుకు నగదు రివార్డులను అందించారు. వీరీ తోపాటు ఎస్‌టిఎఫ్ ఎ టీం నంద్యాల అంజిరెడ్డి టీమ్‌కు, సికింద్రాబాద్‌లో 206.75 లీటర్ల ఎన్‌డీపీఎల్ లిక్కర్‌ను పట్టుకున్న సిఐ జగన్‌మోహన్ రెడ్డికి, మీర్‌పేట్‌లో 64.6 టీటర్ల ఎన్‌డీపీఎల్ మద్యాన్ని ఎంపిఆర్ చంద్రశేఖర్ టీమ్‌కు, అదిలాబాద్‌లో 63.80 లీటర్ల మద్యాన్ని పట్టుకున్న ఎస్టీఎఫ్ సిఐ బిక్షారెడ్డికి, ఉప్పల్‌లో 61.80 లీటర్ల మ ద్యాన్ని పట్టుకున్న ప్రదీప్‌రావు టీమ్‌కు అమీర్‌పేట్‌లో 50.62 టీటర్ల మద్యం పట్టుకున్న స్మీత సౌజన్య టీమ్‌కు నగదు రివార్డులను అందించారు.

## మంత్రి పొంగులేటిని కలిసిన రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తాజాగా రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి మంగళవారం రాష్ట్ర రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సేవలో ఆయనకు ఉన్న అనుభవం, నిబద్ధత తెలంగాణ గళాన్ని దేశ రాజధానిలో బలంగా వినిపించేందుకు దోహదపడుతాయని మంత్రి ఆకాంక్షించారు. రాజ్యసభలో ఆయన పార్లమెంటరీ ప్రస్థానం విజయవంతంగా సాగుతూ ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని మంత్రి ఆకాంక్షించారు.

## 23 నర్సింగ్ స్కూళ్లపై చర్యలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న జి.ఎన్.ఎమ్ నర్సింగ్ స్కూళ్లపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. ఒకే భవనంలో రెండుకు మించి స్కూల్స్ నిర్వహించడం, ప్రభుత్వ గుర్తింపు పొందిన చోట కాకుండా ఇతర ప్రాంతాల్లో తరగతులు జరపడం, సరైన మౌలిక సౌకర్యాలు, అధ్యాపకులు లేక పోవడం వంటి ఉల్లంఘనలపై క్రైస్తవ జన సమితి (సిజెఎస్) అధ్యక్షుడు డాక్టరు మాసారం ప్రేమ్ కుమార్ గత సెప్టెంబర్ 2025లో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, ప్రభుత్వానికి ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ప్రభుత్వం 40 మంది అధికారులతో కూడిన కమిటీని నియమించి, లోతైన విచారణ జరిపింది. విచారణలో లోపాలు ఉన్నట్లు తేలడంతో, సుమారు 9 నర్సింగ్ స్కూళ్లకు ఒక్కొక్కదానికి 5 లక్షల రూపాయల చొప్పున, మొత్తం 40 లక్షల రూపాయల జరిమానా చెల్లించాలని ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. ఈ సందర్భంగా డాక్టరు మాసారం ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ తన ఫిర్యాదుపై సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకున్నందుకు రాష్ట్ర వైద్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు, నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ఏప్రిల్ 2-3 తేదీల్లో 13వ ఏషియన్ టెక్స్ టైల్ కాన్ఫరెన్సు



**ప్రజాపక్షం/హైదరాబాద్:**ప్రపంచ స్థాయి13వ ఏషియన్ టెక్స్ టైల్ కాన్ఫరెన్సు ఏప్రిల్ 2–3 తేదీల్లో హైదరాబాద్‌లో జరుగుతుందని రాష్ట్ర వ్యవసాయ, చేనేత మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబులు వెల్లడించారు. నోవాటెల్ హెచ్ ఐసిసి లో జరిగే ఈప్రతిష్ఠాత్మక సదస్సుకు వివిధ దేశాలకు చెందిన ఇండస్ట్రీ ప్రతినిధులు, అత్యాధునిక యంత్రాల సరఫరాదారులు, ప్రభుత్వ సంస్థల ఉన్నతాధికారులు పాల్గొంటారని మంగళవారం సచివాలయంలో తెలిపారు. ఈ సందర్భంగా మంత్రులు కాన్ఫరెన్స్ పోస్టర్ ను ఆవిష్కరించారు.తెలంగాణా ప్రభుత్వ నిర్వహించే ఈ సదస్సుకు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ టెక్స్ టైల్ ఇండస్ట్రీ కో హోస్ట్ గా వ్యవహరిస్తుంది. పోస్టర్ విడుదల కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, చేనేత, జౌళి శాఖల ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, టిజిఐఐసి మేనేజింగ్ డైరెక్టర్ శశాంక, డైరెక్టర్ ఇన్వెస్ట్ మెంట్స్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు. గత ఏడాది నిర్వహించిన 12 వ సదస్సు ముంబైలో జరిగింది. వస్త్ర పరిశ్రమలో అంకుర సంస్థలకు తోడ్పాటును అందించడం, ప్రపంచ వస్త్రరంగం అవసరాలు, ముడి సరుకుల లభ్యత, ఇండస్ట్రీ ఎదుర్కొంటున్న సవాళ్లతో పాటు పలు అంశాలపై సదస్సులో సమావేశాలు చోటు చేసుకుంటాయి.

## పట్టణాల్లో 18,213 ఇండ్లకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

పిఎంఎవై (పట్టణ) 2.0 కింద రూ.273 కోట్లు మంజూరు

హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి. గౌతం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో గృహ నిర్మా ణాలను వేగవంతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన్ (పట్టణ) 2.0 పథకం కింద రాష్ట్రంలో 18,213 ఇండ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి. గౌతం తెలిపారు. ఢిల్లీలో నిర్వహించిన పిఎంఎవై (పట్టణ) 2.0 సెంట్రల్ శాంక్షనింగ్ అండ్ మానిటరింగ్ కమిటీ (సిఎస్ఎంసి) సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలకు ఆమోదం లభించినట్లు ఆయన వెల్లడించారు. ఒక్కో ఇంటికి రూ.5 లక్షల వ్యయంతో రాష్ట్రంలోని 118 పట్టణ ప్రాంతాల్లో మొత్తం 18,213 ఇండ్లను నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులకు మొత్తం రూ.910.65 కోట్ల అంచనా వ్యయం కాగా, అందులో కేంద్ర ప్రభుత్వ వాటాగా రూ.273.20 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.637.45 కోట్లు ఉంటాయని వివరిం చారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం తన వాటాగా రూ.273.20 కోట్లను మంజూరు చేయడానికి అంగీకరించినట్లు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయడంలో ఈ నిర్ణయం కీలకంగా మారుతుందని గౌతం అన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో కొనసాగడంపై ఆలోచిస్తా : మాజీ మంత్రి జీవన్ రెడ్డి



**ప్రజాపక్షం/జగిత్యాల :**కాంగ్రెస్ పార్టీలో కొనసాగడంపై ఆలోచిస్తానని మాజీ మంత్రి జీవన్ రెడ్డి మరోసారి సంచలన వాఖ్యలు చేశారు. మంగళవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇంధిరా భవన్‌లో జీవన్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మార్పుపై మాట్లాడారు. జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నిక రోజే కాంగ్రెస్ పార్టీలో కొనసాగడం కొంత ఆలోచించుకునే పరిస్థితి ఏర్పడుతుందని ఆనాడే పేర్కొన్నానన్నారు. అంతే తప్పా ఇప్పుడు ఇంకా ముందుకు వెళ్లలేదన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న మిత్రులు, కార్యకర్తలు సూచనలు, సలహాలు తీసుకుంటానని సమయం, సందర్భం వచ్చిన రోజు తగిన నిర్ణయం తీసుకుంటానన్నారు.

## మైనారిటీలు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

మాజీ ఎంపి మధుయాష్కి గౌడ్

**ప్రజాపక్షం/హయత్‌నగర్:** మైనారిటీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ ఎంపి మధుయాష్కి గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మైనారిటీ సోదర కుటుంబాలకు తెలంగాణ కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం రంజాన్ కానుకలను అందిస్తుందని టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్,మాజీ ఎంపి మధుయాష్కి గౌడ్ అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఆయా డివిజన్లలోని ప్రతి మసీదు కమిటీకి సుమారు 250 చొప్పున రంజాన్ తోఫా కానుకలను అందిస్తున్నారన్నారు. అంతేకాకుండా మసీదులలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం కోసం ప్రభుత్వం రూ. లక్ష వరకు ఆర్థిక సహకారం అందిస్తుందని.. మైనారిటీ సోదరులందరూ పండగను సంతోషంగా జరుపుకోవాలన్నది ప్రభుత్వ ఆకాంక్ష అని పేర్కొన్నారు. సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మైనారిటీ మహిళలకు కుట్టుమిషన్లు మొదలు, రూ.50 వేల ఆర్థిక సహకారం మోపేడ్ వెహికల్స్ అందించడం తదితర చేయూత అందిస్తూ వారి సంక్షేమానికి కృషి చేస్తుందని పేర్కొన్నారు.

## అధికారులు సమన్వయంతో పనిచేయాలి

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**ప్రజాపక్షం/తుర్కయంజాల్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో అధికారులు సమన్వయంతో ప ని చేయాలని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆదిభట్ల సర్కిల్ పరిధి తుర్కయంజాల్ డివిజన్ కార్యాలయంలో శంషాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళ తో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ప్రజల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. పారిశుద్ధ్యం, రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, మంచినీటి సమస్యలను పరిష్కరించేందుకు సర్కిల్ అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదులు పరిగణలోకి సంబంధిత శాఖల అధికారులు పరిష్కరించాలన్నారు. అభివృద్ధి లక్ష్యంగా ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలను అమలు చేయాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త కుర్మ సత్తయ్య, శివకుమార్, డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ భూములకు కంచే చేయండి



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని మేడిపల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూములకు ప్రభుత్వం కంచే ఎర్పాటు చేసి భూములను కాపాడాలని కొరుతూ మంగళవారం సేవాదల్ రాష్ట్ర నాయకులు లిక్కి వెంకట్‌రెడ్డి యాచారం తహశీల్దారు, ఎంపిడిఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఉన్న తూంబాయి కుంట, లక్ష్మి నర్సింహ్మ స్వామి చెందిన భూములు కబ్జాకు గురౌతున్నాయని అన్నారు. గ్రామ కంఠ భూమిని వేలికి తీయాల్సిన అవసరం ఉందన్నారు. ఇష్టా రాజ్యంగా ఎవరు పడితే వారు అక్రమించు కుంటున్న అధికారులు పట్టి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని అగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే సర్వేచేసి భూములను కాపాలడాలన్నారు. లేనిపక్షంలో అందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రేస్ పార్టీ నాయకులు వెంకట్‌రెడ్డి అక్బర్ తదితరులు పాల్గోన్నారు.

## మంచి నీటి సమస్య పరిష్కరించాలి



**ప్రజాపక్షం/యాచారం :** యాచారం మండల పరిధిలోని మేడిపల్లి నక్కర్త గ్రామ పంచాయతీ పరిధిలోని 1 వార్డులో మంచి నీటి సమస్యతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. గత పది రోజులుగా మంచి నీరు రాక పడరాని పాట్లు పడుతున్నారు. అండర్ డ్రైనేజి పనులు చేస్తుండగా అక్కడ ఉన్న 14 కుటుంబాలకు సంబంధించి మంచినీటి పైపు లైన్ కట్ అయ్యిం ది. ఐదురోజులు అవుతున్న మంచినీటి సమస్య పరిష్కారం కావడం లేదు. ఎండకాలం కావడం వల్ల స్నానం చేయడానికి బట్టలు ఉతకడానికి నానా ఇబ్బందు లు పడుతున్నారు. వాహనాల రాక పోకలకు సైతం ఇబ్బంది పడుతున్నారు. గ్రామ ప్రజాప్రతినిధులు పట్టించుకోని సంబందిత కాంట్రాక్టరుతో మాట్లాడి మంచినీటి సమస్యను పరిష్కరించాలని వార్డు పేదలు కోరుతున్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పారిశుద్ధ్య పనులు



**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రణాళిక ప్రజాపాల ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం శంకర్ పల్లి ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. మున్సిపాలిటీ పారిశుద్ధ్య సిబ్బందితోపాటు స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్ ఎస్. ప్రవీణ్ కుమార్, వైస్ చైర్మన్ జూలకంటి శ్వేతా పాండురంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్ యోగేష్, సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది, ఆశా వర్కర్లు ఈ పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక్కడ జరుగుతున్న పనులను చేవెళ్ల ఆర్డీఓ పార్థసింహారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ 99 రోజుల ప్రణాళిక కార్యక్రమం లో చేపట్టవలసిన పనులను అధికారులు, ప్రజా ప్రతినిధులు తూచా తప్పకుండా పూర్తి చేయాలని ఆదేశించారు.

## మహిళలతోనే దేశ అభివృద్ధి సాధ్యం

**ప్రజాపక్షం/హయత్‌నగర్ :** మహిళ తోనే దేశ అభివృద్ధి సాధ్యమని రంగేశ్వరి నాయుడు మంగళవారం నాగోల్ డివిజ న్ పరిధిలోని రాక్ టౌన్ కాలనీ లోని గ్రీన్ టెర్రస్ అపార్ట్మెంట్ నందు నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎల్.బి.నగర్ నియోజకవర్గ భారస పార్టీ మహిళా అధ్యక్షురాలు రంగేశ్వరి నాయుడు ఈ సందర్భంగా మహిళా సోదరీమణులతో కలిసి మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమములో మహిళా సోదరీమణులు సరితా , అర్చన రెడ్డి, కవిత, శిల్ప రెడ్డి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# ఒటిఎస్ సిక్సర్‌తో జిహెచ్ఎంసి ప్రచారం

### ప్రాపర్టీ టాక్స్ బకాయిల చెల్లింపుపై నగర ప్రజల్లో అవగాహన




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆస్తి పన్ను బకాయిల పరిష్కారానికి తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటిఎస్) పథకంపై నగర ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిహెచ్ఎంసి సరికొత్త ప్రచారానికి శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా ఓటిఎస్ సిక్సర్ పేరుతో క్రికెట్ నేపథ్యంలో రూపొందించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నగర ప్రజలకు పథకం ప్రయోజనాలను సులభంగా అర్థమయ్యేలా రూపొందించిన ఈ ప్రచార సందేశాలను సామాజిక మాధ్యమాలు, డిజిటల్ వేదికల ద్వారా విస్తృతంగా ప్రజలకు చేరవేస్తున్నారు. ముఖ్యంగా క్రికెట్ నేపథ్యంతో రూపొందించిన ఓటిఎస్ సిక్సర్ వీడియో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ పథకంపై అవగాహన పెంచుతోంది. ప్రాపర్టీ టాక్స్ చెల్లింపుల్లో పారదర్శకతను పెంపొందించేందుకు జిహెచ్ఎంసి పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే పన్ను స్వీకరిస్తోంది. నగర ప్రజలు తమ ఆస్తి పన్నును జిహెచ్ఎంసి పోర్టల్ (ghmc.gov.in), మై క్యూర్ యాప్, మీ సేవ కేంద్రాలు, అలాగే జిహెచ్ఎంసి సిటిజన్ సర్వీస్ సెంటర్లలో సులభంగా చెల్లించవచ్చని అధికారులు తెలిపారు. ఇంటి పన్ను బకాయిలు ఉన్న వారు మార్చి 31లోపు చెల్లిస్తే వడ్డీపై 90 శాతం వరకు రాయితీ పొందే అవకాశం ఉందని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ ఓటిఎస్ పథకం ద్వారా బకాయిలను సులభంగా చెల్లించుకునే అవకాశాన్ని వినియోగించుకోవాలని నగర ప్రజలను కోరారు.

**ముమ్మరంగా ప్రచార కార్యక్రమాలు..**

ఇప్పటికే ఎఫ్ఎం రేడియోలు, బస్ షెల్టర్లు వంటి వేదికల ద్వారా ప్రాపర్టీ టాక్స్ బకాయిల చెల్లింపు, ఓటిఎస్ పథకం గురించి గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా జిహెచ్ఎంసి విస్తృత ప్రచారం చేపట్టింది. ఇంకెందుకు ఆలస్యం వెంటనే మీ ఆస్తి పన్ను చెల్లించండి. ఈ అవకాశాన్ని వదులుకోకండి. నగరాభివృద్ధికి మీ వంతు సహకారం అందించండి అని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ నగర ప్రజలను కోరారు.

## భవన నిర్మాణ అనుమతుల.. ప్రక్రియ వేగవంతం చేయాలి



సిఎంసి కమిషనర్ సృజన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్(సిఎంసి) కమిషనర్ జి.సృజన పట్టణ ప్రణాళిక విభాగం(టౌన్‌ప్లానింగ్) అధికారులను ఆదేశించారు. అనధికార నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ స్పష్టం చేశారు. సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించిన వివిధ అంశాలపై కమిషనర్ ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. రోడ్ల విస్తరణకు ఆటంకంగా ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని సూచించారు. లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. కోర్టు కేసుల విషయంలో సంబంధిత అధికారులు సమన్వయంతో వ్యవహరించి, పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. నగరంలో జంక్షన్ల అభివృద్ధి, రోడ్ల విస్తరణ పనుల పురోగతిని సమీక్షించారు. నిర్ణీత గడువులోగా ఈ పనులన్ని పూర్తి కావాలన్నారు. టౌన్ ప్లానింగ్ అంశాలపై ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను ఏమాత్రం అలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను బలోపేతం చేయాలన్నారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కమిషనర్ సృజన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో చీఫ్ సిటీప్లానర్ బి.వెంకన్న, సిటీప్లానర్లు తులసిరామ్, శైలజ, శ్యామ్ కుమార్, అసిస్టెంట్ సిటీప్లానర్లు పాల్గొన్నారు.

## భవానీపురంలో పార్కు స్థలాన్ని కాపాడిన హైడ్రా

400 గజాల స్థలంలో ఆక్రమణల తొలగింపు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శేరిలింగంపల్లి మండలం చందానగర్ పరిధిలోని భవానీపురం లో పార్కు స్థలాన్ని ఆక్రమణ నుంచి హైడ్రా అధికారులు కాపాడారు. కాలనీలోని సుమారు 400 గజాల పార్కు స్థలం కొంతమంది ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని భవానీపురం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హైడ్రా అధికారులు జిహెచ్ఎంసి అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. గతంలో జిహెచ్ఎంసి అధికారులు పార్కు స్థలానికి ప్రహరీ నిర్మించి హద్దులు నిర్ణయించినట్లు గుర్తించారు. అయితే అదే ప్రహరీని పునాదిగా చేసుకుని కొందరు ఇల్లు నిర్మించేందుకు ప్ర యత్నిస్తున్నట్లు గుర్తించారు. లేఅవుట్ ప్రకారం ఆ స్థలం పార్కు కోసం కేటాయించనదిగా నిర్ధారించిన హైడ్రా అధికారులు మంగళవారం ఆక్రమణలను తొలగించారు. అనంతరం సు మారు 400 గజాల స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, పార్కు స్థలం అని సూచిస్తూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ స్థలం విలువ సుమారు రూ.2 కోట్ల వరకు ఉంటుంద ని స్థానికులు అంచనా వేస్తున్నారు. పార్కు స్థలాన్ని కాపాడినందుకు హైడ్రా అధికారులకు కాలనీ వాసులు అభినందనలు తెలిపారు.

## పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల సామాగ్రి పంపిణీ

**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** ప్రభుత్వ పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు తమ సొంత ఖర్చులతో పరీక్షల కోసం ప్యాడ్లు, పెన్నులు, పెన్సిల్‌లను హస్తినాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దెంది శశిధర్‌రెడ్డి పంపిణీ చేశారు. మంగళవారం నందనవనం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందచేశారు. సందర్భంగా శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టంగా చదవకుండా, ఇష్టంతో చదవాలని ఆయన ఆకాంక్షించారు. పట్టుదలలో చదువునప్పుడే భవిష్యత్ ఉన్నత స్థానాలకు చేరుకుంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, దర్గా శ్రీను, సమీ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## నిరుపేద విద్యార్థినికి చేయూత



**ప్రజాపక్షం/తుర్కయంజాల్:** పేదరికం కారణంగా చదువు కొనసాగించడానికి ఇబ్బంది పడుతున్న నిరుపేద విద్యార్థినికి తుర్కయంజాల్ బిజెపి అధ్యక్షుడు ఎలిమినెటిబినరసింహారెడ్డి అండగా నిలిచి తన దాతృత్వం చాటుకున్నారు. ఆదిభట్ల సర్కిల్ తొర్రూరు డివిజన్ పరిధి బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన గంగాపురం ప్రణతి బ్రిలియంట్ పాఠశాలలో 8వ తరగతి విద్యను అభ్యసిస్తుంది. వారి కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉండడంతో మంగళవారం పాఠశాల కు వెళ్లి విద్యార్థినికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలాగే ఈ సంవత్సరం కూడా తన సొంత నిధులతో ఫీజులు చెల్లించడం జరిగింది అని పేర్కొన్నారు. నిరుపేద విద్యార్థులకు చేయించనివ్వడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎ ఎన్ ఆర్ టీం సభ్యులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## సావిత్రి బాయి నేటి యువతకు ఆదర్శం

**ప్రజాపక్షం/హయత్ నగర్:** మహిళా అభున్నతి విద్యతోనే సాధ్యమని చెప్పిన వీరవనిత సావిత్రి బాయి పూలే అని యువజన కాంగ్రెస్ నాయకులు సత్య తేజ్ రెడ్డి అన్నారు. సావిత్రి బాయి పూలే వర్ధంతి సందర్భంగా మన్సూరాబాద్ డివిజన్ సహారాలోని సావిత్రి బాయి పూలే విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించిన ఎల్ బి నగర్ యువజన కాంగ్రెస్ నాయకులు సత్య తేజ రెడ్డి ఈ సందర్భంగా జక్కిడి సత్య తేజ రెడ్డి మాట్లాడుతూ మహిళ సాధికారతకు విద్య విస్తరణకు జీవితాన్ని అంకితం చేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే గారు అని కొనియాడారు నేటి యువత సావిత్రిబాయి పూలే గారి ఆశయాలను కొనసాగించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పృథ్వీరాజ్ , శ్యామల్ రెడ్డి , విటల్ రెడ్డి , గంట శ్రవణ్ ,రాజశేఖర్ రెడ్డి , జానీ తదితరులు పాల్గొన్నారు.

## వేస్ట్ ప్లాస్టిక్‌తో బెంచీల తయారీ



**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రణాళిక ప్రజా పాల ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం పురపాలక సంఘం శంకర్ పల్లి, బిస్లరీ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో కలిసి ప్లాస్టిక్ వేస్ట్ టు ఆర్ట్ కార్యక్రమంలో వేస్ట్ బాటిల్ క్యాప్ లతో 60 కేజీల రీసైకిలింగ్ ప్లాస్టిక్ వేస్ట్ తో రెండు బెంచ్‌ను తయారు చేయించారు. ఈ రెండు బెంచీలు చేయించి సందర్శకులకు సందర్శకుల కొరకు శంకర్ పల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉంచడం అయింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఎస్. ప్రవీణ్ కుమార్, కమిషనర్ యోగేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## సాయిరాం కాలనీలో సిసి రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** సాయిరాం కాలనీలో జరుగుతున్న సిసి రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్‌లోని సాయిరాం కాలనీలో సిసి రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ కాలనీ వాసులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా లెవల్ చూసుకుని పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు కోరారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సంజీవరెడ్డి, శ్రీదేవి, రామ్మూర్తి, రవీందర్, జిహెచ్ఎంసి వర్క్ ఇన్స్‌పెక్టర్ సంజీవరెడ్డి తదితరులు ఉన్నారు.



# అన్ని వర్గాల సంక్షేమానికే ప్రజాపాలన

రంగారెడ్డి కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** అన్ని వర్గాల సంక్షేమానికే రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాల ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణను అమలు చేస్తున్నదని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. మంగళవారం ప్రజాపాల ప్రగతి ప్రణాళిక అమలుపై జిల్లా కలెక్టర్ సి.నారాయణా రెడ్డి, జిల్లా అధికారులు, ఆర్‌డిఒలు, తహసీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలలో పారిశుద్ధ్య నిర్వహణ విధిగా చేపట్టాలని, అదే విధంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ఫైళ్ల పరిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. సమస్యలు లేని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ఉగాది సందర్భంగా సామూహిక గృహప్రవేశాలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా చివరి దశలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను వేగవంతం చేసి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని సూచించారు. గ్రౌండింగ్ కానీ పనులు గ్రౌండింగ్ చేసి పూర్తి అయ్యేలా చూడాలని, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, జనన మరణ ధృవీకరణ పత్రాలు వంటివి ఏ ఒక్క ఫైల్ కూడా పెండింగ్ లేకుండా నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఏ ఒక్క అధికారి కూడా నిర్లక్ష్య ధోరణి అవలంభించకుండా పని చేయాలని, వీధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆదేశించారు. వేసవి మొదలైన సందర్భంగా జిల్లాలో ఎక్కడ కూడా నీటికి ఇబ్బందులు ఏర్పడకుండా చూడాలని తెలిపారు. ఈ నెల 14వ తేదీ నుండి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షలకు అన్నీ ఏర్పాట్లు చేయాలని పరీక్ష కేంద్రంలో అన్నీ మౌలిక సదుపాయాలు ఉండేలా చూడాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో స్థా నిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్,డిఆర్ఓ సం గీత, జెడ్పీ సిఇఒ కృష్ణారెడ్డి,జిల్లా అధికారులు,మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీఓలు,తహసిల్దార్లు,ఎంపిడిఒలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలి**

పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని,అదే విధంగా ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్ ఫైళ్లను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి 99 రోజుల ప్రజాపాల ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహేశ్వరం మండలం సిరిగిరిపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం, ప్రాథమిక పాఠశాల, మహేశ్వరం ప్రధాన రహదారి శుభ్రత పనులను ఆకస్మిక తనిఖీ చేసి పరిశీలించారు.ఈ కార్యక్రమంలో కందుకూర్ ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి,ఎం పి డి ఒ రవీందర్ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

## రైతు భరోసా వెంటనే ఇవ్వాలి

రంగారెడ్డి జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రభుత్వం రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేసి రైతులను ఆదుకోవాలని రంగారెడ్డి జిల్లా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మహేశ్వరం మండలంలోని మోహబూబ్ నగర్, తుమ్మలూరు, గట్టుపల్లి ఆకన్‌పల్లి, కోళ్ల పడకల్, పోరండ్ల, ముచ్చర్ల, మన్సన్ పల్లి,మహేశ్వరం,తదితర గ్రామాలలో ఆ సంఘం సభ్యత్వాన్ని నిర్వహించారు.అనంతరం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల ముందు రైతు భరోసా నిధులను విడుదల చేస్తున్నట్లు సిఎం రేవంత్ రెడ్డి రెడ్డి ప్రకటించిన, లబ్ధి పొందిన తర్వాత నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో రైతు భరోసాపై ఎలాంటి చర్చ జరపలేదని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు మాధవరెడ్డి తీవ్రంగా విమర్శించారు. త్వరలో తమ సంఘం ఆధ్వర్యంలో రైతులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటాలు ఉధృతం చేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం గ్రామాల వారీగా రైతులతో సభ్యత్వ నమోదును చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రైతు సంఘం నాయకులు బి రామచందర్,బి విజయ్,బి అశోక్,కె నరేందర్,ముజీబ్, కృష్ణ,రమేష్,తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని వినతి

**ప్రజాపక్షం/తుర్కయంజాల్:** ఆదిభట్ల సర్కిల్ తొర్రూరు డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని జిహెచ్ఎంసి ఆదిభట్ల సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ రెడ్డిని మంగళవారం తుర్కయంజాల్ బిజెపి అధ్యక్షులు ఎలిమినేటి నరసింహ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలపై వినతి పత్రం అందచేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రాహ్మణపలి సాగర్ హైవే నుంచి తొర్రూర్ వరకు చాలా ప్రమాదకరంగా మారిందని, రాత్రి సమయంలో వీధి దీపాలు లేకపోవడం వల్ల ఈ రోడ్డుపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. రోడ్డుపై ప్రమాదాలు జరగకుండా తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని, రోడ్డుపై వీధి దీపాలు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కమిషనర్‌ను కోరారు. మునగనూరులోని పలు కాలనీలలో గత 10 సంవత్సరాల నుంచి నివాసాలు ఉంటున్నా సరైన రోడ్లు, వీధి దీపాలు లేకపోవడంతో ఆయా కాలనీవాసులు చాలా ఇబ్బందులు ఎదురుకుంటున్నారని ఇప్పటికైనా స్పందించి ఆయా కాలనీలలో రోడ్లు, వీధి దీపాలు తక్షణమే మంజూరు చేసి అట్టి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ ఖచ్చితంగా ఈ సమస్యలకు పరిష్కారం చూపేందుకు చర్యలు చేపడుతామని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, సురేష్ నందగిరి, గుండ కృష్ణ, యాటలి శేఖర్ రెడ్డి, ఎలిమినేటి భరత్ రెడ్డి, అనిల్, మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో 'మేము సైతం'

### మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాం రవి

ప్రజాపక్షం/శామీర్‌పేట : ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో వార్డు కార్యాలయాలను శుభ్రంగా తీర్చిదిద్దుతున్నామని చెత్త చెదారం లేకుండా కాలనీలను శుభ్రం చేస్తున్నామని మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాం రవి అన్నారు. మంగళవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మూడు చింతలపల్లి మున్సిపాలిటి లింగాపూర్‌తాండ, నాగిశెట్టిపల్లి వార్డు కార్యాలయాల పలు కాలనీల పరిసరాలను చైర్మన్ జాం రవి, కౌన్సిలర్లు శ్రమదానం చేసి శుభ్రం చేశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ జాం రవి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళి 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటిలోని అన్ని వార్డు కార్యాలయాలను శుభ్రం చేస్తున్నామని చెప్పారు. పారిశుద్ధ్య నివారణ కు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ప్రజలు భాగస్వామ్యం వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నవీన్, నీరజ్, మేనేజర్ ఉష, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ గౌతమి, రాజేశ్వర్‌రెడ్డి, శానిటరి ఇన్స్‌పెక్టర్ మోహన్‌సింగ్, నాగిశెట్టిపల్లి మాజీ సర్పంచ్, గ్రామస్థులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల ముందు చెత్త వేయొద్దంటూ అవగాహన ర్యాలీ




ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:జిహెచ్ ఎంసి కొంపల్లి సర్కిల్ పరిధిలోని సూరారం కాలనీలో గురువారం జిల్లా పరిషత్ హై స్కూల్ వద్ద చెత్త వేయొద్దంటూ అవగాహన కార్యక్రమం చేపట్టారు. ప్రతిరోజు కొంతమంది స్థానికులు తమ ఇళ్లలోని చెత్తను పాఠశాల గేటు ముందర వేస్తుండటంతో అక్కడ చదువుకునే విద్యార్థులకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో పర్యావరణ ప్రేమికుడు, సామాజిక వేత్త కోన రవీందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో విద్యార్థులు, స్థానిక పెద్దలతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. బ్యాండ్ వాయిస్తూ గల్లీగల్లీ తిరుగుతూ మైక్ ద్వారా చెత్త వేయొద్దని ప్రజలను కోరారు. ఇకపై పాఠశాల వద్ద చెత్తవేస్తే కేసులు నమోదుచేసి మున్సిపాలిటీకి అప్పగిస్తామని హెచ్చరించారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందడమే కాకుండా పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు స్వచ్ఛమైన వాతావరణం కలుగుతుందని కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు.



## పదవ తరగతి విద్యార్థులకు జామెట్రీ బాక్సులు, పెన్నులు అందజేత

ప్రజాపక్షం/చర్లపల్లి: విద్యార్థులు పదిలో పదికి పది సాధించాలని నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం నాగారం డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బిజెపి నాయకులు నక్క కిషోర్‌గౌడ్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు ముఖ్య అతిథిగా విచ్చేసిన చంద్రారెడ్డి జామెట్రీ బాక్సులు, పెన్నులు అంద జేశారు. పదవ తరగతిలో ఉత్తీర్ణులై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు పేరు తీసుకు రావాలన్నారు. పదవ తరగతిలో పదికి పదితో ఉత్తీర్ణులైన వారికి ఆగష్టు 15వ తేదీన నగదును అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, టీచర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## 'ప్రజాపాలన'లో సబ్సిడీపై పనిముట్లు పంపిణీ

ప్రజాపక్షం/శామీర్‌పేట : ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు పంపిణీ చేస్తున్న వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ అన్నారు. మంగళవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అలియాబాద్ మున్సిపాలిటిలోని రైతువేదికలో రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లను సబ్సిడిపై అందజేశారు. అనంతరం జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ మాట్లాడుతూ రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లు రోటోవేటర్లు, స్ప్రేయర్లు, బేలర్స్, సబ్సిడిపై అందిస్తున్నామని చెప్పారు. రైతులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వ్యవసాయ శాఖ మేడ్చల్ మల్కాజ్‌గిరి ఆధ్వర్యంలో ఎటిఎంఎ పథకం ద్వార వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంపై రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రైతులకు మేలు రకాల విత్తనాల ఎంపిక, నానో యూరియా వాడకం, వ్యవసాయ యాంత్రీకరణ, యూరియా బుకింగ్ యాప్ తదితర అంశాలపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్స కమఠం శిరీషా కృష్ణారెడ్డి, వైస్ చైర్ పర్సన్ కన్‌రెడ్డి మాలతి మాధవరెడ్డి, ఎఎంసి డైరక్టర్ తుంకి బిక్షపతి, కౌన్సిలర్లు, రైతులు, మండల వ్యవసాయాధికారి రమేష్, ఎఇఒ, రైతులు పాల్గొన్నా రు.

## మల్లారెడ్డి ఎప్పుడూ యువతను ప్రోత్సహిస్తారు

ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఎప్పుడు యువతను ప్రోత్సహిస్తారని రాష్ట్ర బిఆర్‌ఎస్ యువ నేత చామకూర భద్రారెడ్డి అన్నారు. మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర కల్పనమల్లారెడ్డిల 50వ వివాహ వార్షికోత్సవ సందర్భంగా బిఆర్‌ఎస్ సీనియర్ నేత సామల సందీప్‌రెడ్డి ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేశారు. టోర్నమెంట్‌కి ముఖ్యఅతిథిగా రాష్ట్ర బిఆర్‌ఎస్ యువనేత చామకూర భద్రారెడ్డి, మాజీ ఎంపిపి బండారి శ్రీనివాస్ గౌడ్ పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పోచారం, ఘట్‌కేసర్, మేడిపల్లికి చెందిన బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో..

# కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి విస్తృత పర్యటన





ప్రజాపక్షం/హైదరాబాద్/మల్కాజ్‌గిరి: మల్కాజ్ గిరి 'ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక' లో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి విస్తృతంగా పర్యటించారు. కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పర్యవేక్షించారు. ఐదవ రోజు కార్యక్రమాల భాగంగా వినయ్ కృష్ణా రెడ్డి ఆనంద్‌బాగ్ సర్కిల్‌లో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించి, పారిశుద్ధ్య పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటి నుంచి చెత్తను సాట్ ఆటోల ద్వారా 100 శాతం డోర్ టు డోర్ సేకరణ విధానం కచ్చితం గా అమలు చేయాలని శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్స్ (ఎస్‌ఎఫ్ఎ)కు ఆదేశాలు జారీ చేశారు. నగరం లో ఎక్కడా చెత్త పేరుకుపోకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, పారిశుద్ధ్య సేవలను మరింత బలోపేతం చేయాలని సూచించారు.

**కాప్రా చెరువు వద్ద తనిఖీలు..**

ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తాతో కలిసి కమిషనర్ కాప్రా చెరువు పరిసర ప్రాంతాలను సందర్శించి, అక్కడ జరుగుతున్న శుభ్రత పనులను పరిశీలించారు. చెరువు పరిసరాల్లో పరిశుభ్రత, చెత్త సేకరణ విధానం, గడ్డి మొక్కలను తొలగించేందుకు ఉపయోగిస్తున్న పరికరాలు, నిర్వహణ చర్యలను సమీక్షించారు. పారిశుద్ధ్య సిబ్బందితో మాట్లాడి వారి పనితీరును తెలుసుకున్న కమిషనర్, చెరువు పరిసరాల్లో ఎక్కడా చెత్త వేయకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండేలా సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు. చెరువు ప్రాంతాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచేందుకు క్రమం తప్పకుండా శుభ్రపరిచే కార్యక్రమాలు కొనసాగించాలని ఆదేశించారు. పారిశుద్ధ్య కార్యకలాపాల అమలు విధానాన్ని ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు కమిషనర్ స్వయంగా పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి కాప్రా చెరువు పరిసరాల్లో శుభ్రపరిచే కార్యక్రమంలో పాల్గొన్నారు.

**చెత్త డంపింగ్‌పై చర్యలు..**

కాప్రా చెరువు సమీపంలో నివసిస్తున్న కాలనీ అసోసియేషన్ సభ్యులు చెరువు వద్ద గుర్తు తెలియని వ్యక్తులు చెత్త, నిర్మాణ వ్యర్థాలను అక్రమంగా వేస్తున్నారని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కమిషనర్ సంబంధిత అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్లపై, చెరువు పరిసరాల్లో చెత్త వేస్తున్న వారిని గుర్తించి, జరిమానాలు విధించాలని పారిశుద్ధ్య ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలకు సూచించారు. నివాసితులు తమ చెత్తను తప్పనిసరిగా సాట్ ఆటోలకే అందజేయాలని కమిషనర్ సూచించారు. నగరంలోని 44 ప్రభుత్వ కార్యాలయాలు, బస్తీ దవాఖానా లు, ఇతర ప్రభుత్వ ప్రాంగణాల్లో ప్రత్యేక శుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన 35,257 కిలోల ఘన వ్యర్థాలను సమర్థవంతంగా తొలగించి డంపింగ్ యార్డులకు తరలించారు.

# మహిళలు వివిధ రంగాల్లో రాణించాలి

### ఎఐటియుసి జాతీయ కార్యదర్శి సురవరం విజయలక్ష్మి






ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి: అందుబాటులో అన్ని అవకాశాలు, ప్రభుత్వ చేయూతను అందిపుచ్చుకొని మహిళలు వివిధ రంగాల్లో రాణించాలని ఎఐటియుసి జాతీయ కార్యదర్శి సురవరం విజయలక్ష్మి అన్నారు. నాచారంలోని ఇఎస్ఐ ఆస్పత్రిలో మంగళవారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రమేష్ బాబు, ఆర్ఎంఒ డా.సతీష్, టిజిడిఎ జనరల్ సెక్రటరి ప్రీతి, గ్రేస్ కార్బొట్, నర్సింగ్ విభాగానికి చెందిన సీనయ్య, ఐఎంఎస్ ఫోరం అధ్యక్షురాలు ప్రేమలత, ఇఎస్ఐ నాచారం శాఖ అధ్యక్షురాలు విక్టోరియా, కార్యదర్శి వేణుకుమార్, అరుణ, భాగ్య, చంద్రకళ, భాగ్య, తదితరులతో కల్సి ఆమె పాల్గొన్నారు.

## బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

### సైకిళ్ల పంపిణీ చేసిన కలెక్టర్ మనుచౌదరి



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : బాలికలు చదువులో ముందుండి అన్ని రంగాల్లో రాణించాలని, దీనికి అవసరమైన పూర్తి సహాయ సహకారాలు ప్రభుత్వం అందిస్తుందని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల సందర్భంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బాలికలకు ఉచితంగా 100 సైకిళ్లు అందించే కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం హాజరు ఉన్న విద్యార్థినులను ఎంపిక చేసి 21మందికి సైకిళ్లు ఉచితంగా బ్యాంకు అందచేసిందన్నారు. జిల్లా విద్యా శాఖాధికారి విజయకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు ఆత్మ స్థైర్యంతో తమ లక్ష్యాలను చేరుకోనేందుకు పోటీపడి చదివాలన్నారు. వారికి ఆసక్తి ఉన్న అంశాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, బ్యాంకు రీజనల్ మేనేజర్, విద్యార్థినుల తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తలసేమియా వంటి వ్యాధులను ముందుగానే గుర్తించాలి

### అదనపు కలెక్టర్ ఫైజల్ అహ్మద్



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:తలసేమియా వంటి వ్యాధులను ముందుగానే గుర్తించటం ద్వారా పూర్తిస్థాయిలో నివారించగలుగుతామని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజల్ అహ్మద్ అన్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖ, బ్లడ్ వారియర్స్ ఫౌండేషన్‌లు సంయుక్తంగా జిల్లాలో మంగళవారం నిర్వహిస్తున్న తలసేమియా, అనీమియా అవగాహన నివారణ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా వివాహాలకు ముందు హెచ్‌పిఎల్‌సి పరీక్షలు చేయించుకోవటం ద్వారా ముందుగానే వ్యాధి లక్షణాలను గుర్తుంచుకోగలుగుతారన్నారు. జిహెచ్ఎంసి ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తా మాట్లాడుతూ తలసేమియా మేజర్‌తో పుట్టిన పిల్లలకు జీవితాంతం చికిత్సలు అవసరం అవుతుందని, అలాంటి పిల్లలకు సాధారణంగా ప్రతి 15–20 రోజులకు ఒకసారి రక్తం ఎక్కించాల్సి ఉంటుందని, ఇలాంటి వ్యాధిగ్రస్తులకు జీవితకాల వ్యయం కోటిన్నర రూపాయల వరకు అవుతుందని, దీనివల్ల ఆయా కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతింటారన్నారు. వైద్య నిపుణుల అంచనాల మేరకు దేశం లో 4 శాతం వరకు తలసేమియా కారియర్లు ఉన్నారన్నారు.

ఇద్దరు కారియర్లు వివాహం చేసుకొంటే పిల్లలకు సైతం తలసేమియా వచ్చే అవకాశాలు 25 శాతం వరకు ఉంటుందని, ఇలాంటి పరిస్థితులు రాకుండా ఉండేందుకు వివాహాలకు ముందు హెచ్‌పిఎల్‌సి రక్త పరీక్షలు అవసరమన్నారు. జిల్లాలోని టివివిపి ఆస్పత్రు లు, పిహెచ్‌సి లు కళాశాలల్లో దీనికోసం అవగాహనా కార్యక్రమాలు, స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహిస్తారని, ముఖ్యంగా 18–40ఏళ్లలోపున్న యువత వైద్య పరీక్షలు జరిపించుకోవాలని డిఎంహెచ్ఓ డా.ఉమాగౌరి తెలిపారు. స్వయం సహాయక సంఘాలు, పారిశుద్ధ్య కార్మికులు, ఆశా వర్కర్లు, ఆరోగ్య శాఖ నెట్ వర్క్ సాయం తో ప్రజల్లో అవగాహన కల్పించే ఏర్పాట్లు చేసామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వసంత కుమారి, సునీత, గాయత్రి, రాథేశ్యామ్ తపాడియా, బ్లడ్ వారియర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సందీప్, కృష్ణవంశీ తదితరులు పాల్గొన్నారు.

# సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర గొప్పది

### కలెక్టర్ దీపక్ తివారి



ప్రజాపక్షం/వికారాబాద్ : సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతోగొప్పది, కుటుంబం నుండి దేశ నిర్మాణం వరకు ప్రతిరంగంలో మహిళల తమ ప్రతిభను చాటుకుంటున్నారని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారం మహిళ శిశుసంక్షేమ, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మహిళా సాధికారత కేంద్ర ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించా రు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ మహిళలందరికీ అంతర్జాతీయ మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంవత్సరం మహిళా దినోత్సవం 'లాభం కోసం ఇవ్వండి' అనే థీమ్‌తో ముందుకు వెళ్ళాలని ఉద్ఘాటించారు. మహిళల సాధికారతకు ప్రభు త్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమ లు చేస్తోందని వాటిని ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలు విద్య, ఆరోగ్యం, స్వయం సహాయ రంగాల్లో, ముందు కు రావాలని ఆకాంక్షించారు. సమాజంలో మహిళలకు గౌరవం, భద్రత కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ తెలిపారు. మహిళల అభివృద్ధి ద్వారా సమాజం మరింత బలపడుతుందని పేర్కొన్నారు.

మహిళలు విద్యతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, లింగ వివక్షత పూర్తిస్థాయిలో రూపుమాపాలని అన్నారు. లింగ వివక్షత లేని సమాజం కోసం ప్రతి ఒక్కరు పూనుకోవాలన్నారు. మొదట ఇంటి నుండే మార్పు ప్రారంభం కావాలన్నారు. తెలంగాణ రాష్టంలో 33 జిల్లాల్లో 13మంది మహిళా కలెక్టర్లు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. అంత కు ముందు రక్తదాన శిబి రం, హెల్త్ క్యాంపును కలెక్టర్ సందర్శించారు. ఉత్త మ ప్రతిభ కనబరుస్తున్న మహిళా అధికారులను వివిధ క్రీడలలో పాల్గొని గెలుపొందిన ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఉమ శంకర్ ప్రసాద్, అడినల్ ఎస్‌పి రాములునాయక్, స్వర్ణకుమారి, చెన్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

**పేద ప్రజలకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలి**

వికారాబాద్‌రూరల్ : ప్రభుత్వ ఆసుపత్రి కి వచ్చే పేద ప్రజలకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రిలో డాక్టర్లు ,సిబ్బంది సమయానికి వస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. ప్రతి రోజు ఇన్ పేషేంట్ ఔట్ పేషంట్ ఎంత మంది వస్తున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. గర్భిణీ స్త్రీలు చెకప్ కు ఎంతమంది వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి అన్ని పరీక్షలు అందుబాటులో ఉన్నాయని ,ప్రతి నెల ఎన్ని డెలివరీలు జరుగుతున్నాయని అడిగి తెలుసుకొని ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాల సంఖ్య పెరిగేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు ఔషధ నిల్వలు, రోగులకు అందుతున్నా సౌకర్యాలను ఈ సందర్భంగా పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సమయానికి, చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని అదేశించారు.

ఆసుపత్రి పరిశుభ్రత, రికార్డులనిర్వహణ, మందులు అందుబాటులో వంటి అంశాలపై పరిశీలించారు. వైద్య సేవలు మెరుగుపర్చడానికి అవరపమైన చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులను అదేశించారు. అనంతరం పక్కన ఉన్న సఖి కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సౌమ్య, రజని, వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్ : ఎస్ఐ

ప్రజాపక్షం/దోమః అక్రమ ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్ చేసిన ఎస్ఐ వసంత్‌జాదవ్, పరిగి నియోజకవర్గంలోని దోమ మండల పరిధిలోని పోలీస్‌స్టేషన్ పరిధిలోని బుదలాపూర్ చంద్రనాయక్ తండా గ్రామానికి చెందిన జరుపుల బీముల అక్రమంగా ఇసుక తరలిస్తుండగా ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ అనుమతి లేకుండా ఇసుక, మట్టి తరలిస్తే ఎంతటివారినైనా వదిలి పెట్టే ప్రసక్తి లేదన్నారు.

## కామ్రేడ్ రామాంజనేయులు మరణం బాధాకరం

### సిపిఐ కార్యదర్శి ఉమా మహేష్



ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ : జగద్గిరిగుట్ట శాఖ సిపిఐ నాయకులు కామ్రేడ్ రామాంజనేయులు గుండె పోటుతో మృతి చెందడం బాధాకరమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. మంగళవారం రామాంజనేయులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, వారి కుటుంబానికి సానుభూతిని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాంజనేయులు సిపిఐ ఇచ్చే అన్ని పిలుపుల్లో స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం కొరకు పనిచేశారని తెలిపారు. దుర్గయ్య మరణం రోజున చాలా బాధపడి ఇలాంటివి భవిష్యత్తులో జరగొద్దని అభిప్రాయం వ్యక్తం చేసిన కొద్దిరోజుల్లోనే తమ నుండి దూరం కావడం బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శులు రాములు, హరినాథ్‌రావు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ప్రజానాట్యమండలి అధ్యక్షులు బాబు, సిపిఐ నాయకులు ఒక్కరి మల్లేష్, ఇమామ్, నర్సింహా, చారి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో డిప్యూటీ కమిషనర్ ఎన్.కృష్ణారెడ్డి

ప్రజాపక్షం/దుండిగల్ : తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం చేపడుతున్నామని డిప్యూటీ కమిషనర్ ఎన్.కృష్ణారెడ్డి అన్నారు. అందులో భాగంగా ఐదవ రోజు నిర్వహించిన కార్యక్రమాలలో సైబరాబాద్ మున్సిప ల్ కార్పొరేషన్ పరిధిలోని కొంపల్లి సర్కిల్56 లో స్వచ్ఛత చర్యలను మరింత బలోపేతం చేసే దిశగా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా



ఇంటింటి చెత్త సేకరణ సేవలు అందని గృహాలను గుర్తించి, ఆయా గృహాలకు స్వచ్ఛ సాథీలు అనుసంధానం చేయడం జరిగింది. ఎస్ఎటి బృందాలు ప్రాంతాలను సందర్శించి చెత్త సేకరణ సేవలు అందని గృహాలను గుర్తించి, వెంటనే సంబంధిత స్వచ్ఛ సాథీలకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రజలకు ఇంటింటి చెత్తను సరైన విధంగా అందజేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో మున్సిపాలిటీకి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమం డిప్యూటీ కమిషనర్ ఎన్.కృష్ణా రెడ్డి పర్యవేక్షణలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొని విజయవంతంగా నిర్వహించారు.



## విజ్ఞానయాత్రకు తరలిన మహిళా రైతులు

ప్రజాపక్షం/శామీర్‌పేట : మేడ్చల్ జిల్లా హార్టికల్చర్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం పురస్కరించుకుని ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్శిటీకి మహిళా రైతులు విజ్ఞానయాత్ర చేపట్టారు. ఈ విజ్ఞాన యాత్రకు శామీర్‌పేట, ఆద్రాస్ పల్లి, నారాయణపూర్, కీసర గ్రామాల నుంచి మహిళా రైతులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈ సందర్భంగా హార్టికల్చర్ డైరక్టర్ యాస్మిన్ బాష రైతులకు అందజేస్తున్న ఉద్యాన పథకాలను సమగ్రంగా వివరించారు. మామిడి, జామ, బొప్పాయి, తోటల పెంపకంపై రాయితీ ఇస్తున్నారని చెప్పారు. మాల్చింగ్ షీట్ సాగు పద్ధతికి రాయితీ ఇస్తున్నామన్నారు. కూరగాయల సాగు విత్తనాలు, తీగ జాతి రకాల పందిర్లు సాగుకు రాయితీ ఇస్తున్నారు. రైతులకు 50 శాతం సబ్సిడీ రాయితిపై ప్లాస్టిక్ బాక్సులు ఇస్తున్నారు. రైతులకు పంట సాగుకు ఉపయోగపడే ఫామ్ మెకనైజేషన్ 40, 50 శాతం సబ్సిడీపై రాయితీ ఇస్తున్నారు. బిందు సేద్యం పద్ధతిలో రైతు సోదరులకు డ్రిప్ పరికరాలు రాయితీపై అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి శ్రీధర్, మండల ఉద్యాన అధికారి వెంకటరమణ, మండల విస్తరణ అధికారి సాగరిక, మహిళా రైతులు, తదితరులు పాల్గొన్నారు.



## సర్పంచ్‌లు, మున్సిపల్ వార్డు సభ్యులు, చైర్మన్లు, మేయర్లకు ప్రత్యేక గుర్తింపు కార్డులు

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి: ప్రతి జిల్లాలో ఎన్నికైన సర్పంచులు, మున్సిపల్ వార్డు సభ్యులు, చైర్మన్లు, మేయర్లకు ఈ నెల 12న ప్రభుత్వం అమలుచేసే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో పాటు ఇటీవల చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక అంశాలపై అవగాహన కల్పించేందుకు శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నారు. దీంతోపాటు సర్పంచులు, మున్సిపల్ వార్డుసభ్యులు, చైర్మన్లు, మేయర్లకు ప్రత్యేకంగా రూపొందించిన గుర్తింపు కార్డులను అందచేయనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పంచాయతిరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి సంజయ్ కుమార్, మున్సిపల్ పరిపాలన కార్యదర్శి టికె శ్రీదేవి, సెర్ప్ సిఈఓ దివ్య, ప్రణాళికా శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్‌లతో కల్సి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమాలకు జిల్లాలోని ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను సైతం భాగస్వాములను చేయాలని కలెక్టర్లను ఆదేశించారు.

## తోర్‌మామిడికి జహీరాబాద్ నైట్ బస్సు సర్వీసు సౌకర్యం కల్పించండి



ప్రజాపక్షం/బంట్వారం : ప్రజా సౌకర్యం కోసం జహీరాబాద్ నుండి తోర్‌మామిడి గ్రామానికి నైట్ ఔట్ బస్సు సర్వీసు కల్పించాలని తోర్‌మామిడి గ్రామ సర్పంచు సంజీవయ్య జహీరాబాద్ డిపో మేనేజర్ స్వామీకి వినతిపత్రం అందజేశారు. డిపో మేనేజర్ సానూకులంగా స్పందించి బస్సు సర్వీసు నైట్ ఔట్ కు వచ్చేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచు స్వప్న నర్సిములు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, యువకులు తదితరులు ఉన్నారు.

